క్లుప్తంగా

శ్రీరామచంద్ర కీర్తనల ఆలాపన



నెల్లూరు(బృందావనం): శ్రీరామ నవమిని పురస్కరించుకుని కొండాయపాళెంరోడ్డు ఇస్కాన్ సిటీ హనుమాన్ జంక్షన్‌లో శుక్రవారం రాత్రి గోవిందరాజు సీతాదేవి సంగీత, సాహితీ వేదిక ఆధ్వర్యంలో శ్రీరామచంద్రుడిని కొనియాడుతూ కీర్తనలు ఆలపించారు. ప్రముఖ గాయకులు, సంగీత విద్వాంసులు హర్షవర్ధిని, ఉషాదేవి, లక్ష్మీకామాక్షి, చేజర్ల వినయ తదితరులు కీర్తనలు ఆలపించారు. సుబ్రహ్మణ్యం మృదంగంపై వాద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని ఆ వేదిక అధ్యక్షురాలు సుభద్రాదేవి పర్యవేక్షించారు.

అధికారుల పరిశీలన

నెల్లూరు(అర్బన్): నగరంలోని బాలాజీనగర్ – 1, 2 సచివాలయాల పరిధిలో రామాలయం వీధి, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం వైద్య, ఆరోగ్య సిబ్బంది చేస్తున్న ఫ్రైడే డ్రైడే అవగాహన కార్యక్రమాన్ని జిల్లా మలేరియా విభాగం సహాయ అధికారి నాగార్జునరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లలో జరుగుతున్న సర్వేను పరిశీలించి ఆయన మాట్లాడారు. దోమలు, ఇతర పురుగుల వల్ల మలేరియా, డెంగీ, ఫైలేరియా, చికున్‌గన్యా లాంటి వ్యాధులతోపాటు అతిసారా వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రజలు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఇంట్లో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. లార్వాలు మృతిచెందేందుకు ప్రతి శుక్రవారం నీటి తొట్టిలను, బిందెలను, బకెట్లను ఎండబెట్టాలన్నారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ రామారావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బీజేపీ నేతల సంబరాలు



నెల్లూరు రూరల్: వక్ఫ్ సవరణ చట్టం పార్లమెంట్‌లో ఆమోదం పొందిన నేపథ్యంలో నెల్లూరు నగరంలోని చిన్న బజార్ బీజేపీ కార్యాలయంలో బీజేపీ, మైనారిటీ మోర్చా నేతలు శుక్రవారం సంబరాలు చేసుకుని స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్, మండలాధ్యక్షుడు హేమంత్, మైనారిటీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు లాల్ ఖాజామస్తాన్, బూత్ అధ్యక్షుడు మస్తాన్, పెంచలయ్య, నాగేంద్ర, శ్రీనివాసులు, జయశంకర్ కృష్ణ, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్‌లో అరుదైన చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): తీవ్ర గుండెపోటుకి గురై స్పృహ కోల్పోయిన ఓ వ్యక్తికి అత్యంత క్లిష్టమైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లుగా దర్గామిట్టలోని కిమ్స్ స్పెషాలిటీ ఆస్పత్రి కార్డియాలజిస్టులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో వారు వివరాలు వెల్లడించారు. మనుబోలు మండలం కాగితాలపూరు గ్రామానికి చెందిన 43 ఏళ్ల చిట్టిబాబు అనే వ్యక్తికి వారం రోజుల క్రితం గుండెపోటు వచ్చిందన్నారు. యాంజియోగ్రామ్ చేసి స్టంట్ వేశామన్నారు. ఇంట్రా ఆర్టీరియల్ బెలూన్ పంపింగ్ (ఐఏబీపీ) ప్రొసీజర్‌ను చేసి మెడలో నరానికి ఇంజెక్షన్ ఇచ్చి గుండె వేగాన్ని తగ్గించామన్నారు. ఎమర్జెన్సీ విభాగం హెచ్‌ఓడీ డా.శ్రీనివాసులురెడ్డి, సీనియర్ కార్డియాలజిస్ట్ డా.సాహెబ్‌పీర్ తదితరుల సహకారంతో రోగి ప్రాణాలు కాపాడామన్నారు. డాక్టర్ల బృందాన్ని ఈడీ గిరినాయుడు, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సతీష్‌కుమార్, మెడికల్ కో–ఆర్డినేటర్ డా.శ్రీధర్‌రెడ్డిలు అభినందించారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



నెల్లూరు సిటీ: సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 11 మంది దివ్యాంగులకు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ శైలేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జలం.. గరళం

- వాటర్ ప్లాంట్ల నిర్వహణపై సందేహాలెన్నో..
- ఐఎస్ఐ ధ్రువీకరణ లేకుండానే అమ్మకం
- రుచికోసం శాక్రిన్, కెమికల్స్ కలుపుతూ మోసం
- భవిష్యత్‌లో రోగాల పాలయ్యే అవకాశం



మినరల్ వాటర్ ప్లాంట్

నెల్లూరు(బారకాసు): ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మినరల్ వాటర్‌కు గిరాకీ ఏర్పడింది. గొంతు తడుపుకొనేందుకే ఒక్కో కుటుంబం నెలకు వందలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన రోజులు వచ్చాయి. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని జనాభా సంఖ్య 8 లక్షలు. వీరికి డబ్ల్యూహెచ్ఓ చెప్పిన దాంట్లో సగం నీరు కూడా అందడం లేదు. ఈ నేపథ్యంలో తాగు నీటి కోసం ప్రజలు తిప్పలు పడుతున్న పరిస్థితి ఉంది. కచ్చితంగా మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇప్పటికే సుమారు 200 నుంచి 300 వరకు ప్లాంట్లు వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నాయి. కొన్ని నాణ్యతా ప్రమాణాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఎలాగో అనుమతులు తెచ్చుకుని సాదాసీదాగా క్యాన్లలో నీరు నింపుతున్నారు. ఆ నీటిని రోగాలపాలయ్యే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చౌకగా నిర్మాణం

అన్ని ప్రమాణాలు పాటించి మినరల్ వాటర్ అందించాలంటే భారీ వ్యయం చేయాల్సిందే. కానీ చాలాచోట్ల కేవలం రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలతో చిన్న వాటర్ ప్లాంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. బోరు వేయించిన తర్వాత ప్లాస్టిక్ ట్యాంక్‌లను కొనుగోలు చేస్తున్నారు. అతి చౌకగా ప్యూరిఫైయిడ్ మెషీన్లను తీసుకుని నీటిని శుద్ధి చేస్తున్నారు. సోడియం కార్బోనేట్, సోడియం క్లోరైడ్, శాక్రిన్ కలిపి నీటికి రుచి తెస్తున్నారు. ఆ తర్వాత యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ల్యాబ్ టెస్టింగ్ చేయరు.. వాటర్ క్యాన్లపై తయారీ తేదీ (ఎంఎఫ్‌డీ) కూడా ఉండదు. ఇంత జరుగుతున్నా అధికారుల వైపు నుంచి స్పందన లేదు.

అమ్మేస్తున్నారు

నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోకుండా నీటిని ప్యాక్ చేయడమే కాకుండా రేట్లను కూడా ఇష్టానుసారంగా విధిస్తున్నారు. 20 లీటర్ల నీటిని రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. 200 వాటర్ ప్యాకెట్లున్న బ్యాగ్‌ను రూ.50కి అమ్ముతున్నారు. విడిగా ఒక్కో ప్యాకెట్‌ను రూ.2కు అమ్ముకుంటున్నారు.

నిబంధనలిలా..

ప్లాంట్‌కు కనీసం 2,200 చదరపు మీటర్లు కేటాయించి నిర్మాణం చేపట్టాలి. నీటిని నిల్వ ఉంచేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంక్‌లనే వాడాలి. పంపింగ్ చేసే సమయంలో కూడా ఆ పైపులనే ఉపయోగించాలి. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రివర్స్ ఆస్మాసిస్ ప్రక్రియ ద్వారా నీటిని శుభ్రపరచాలి. నీటిలోని వైరస్, బ్యాక్టీరియాను నాశనం చేయడానికి అల్ట్రావైలెట్ సిస్టమ్‌ను పాటించాలి. బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. శుద్ధి అయిన నీటిని నిపుణులైన క్వాలిఫైడ్ టెక్నీషియన్ ద్వారా పరీక్షించాలి. ఆ తర్వాతే మార్కెట్‌లో విక్రయించాలి.



క్యాన్‌లో నీరు నింపుతున్న దృశ్యం

చర్యలు తీసుకుంటాం



యజమానులు నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా మినరల్ వాటర్‌ను విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. ఇటీవల మినరల్ వాటర్ సరఫరా చేస్తున్న వాహనాన్ని తనిఖీ చేసినప్పుడు అందులో వాటర్ ప్యాకెట్లపై తయారీ తేదీ తదితర వివరాలు ఏమీ లేకపోవడంతో స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశాం. అంతేకాకుండా సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేసి జరిమానా విధించాం. ప్లాంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా ప్రమాణాలు పాటించాలి.

– డాక్టర్ చైతన్య, ఎంహెచ్ఓ, మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు

రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు



ఉత్సవమూర్తికి పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం మహిళలు రాహుకాల దీపాలు వెలిగించి, ఉద్యాపన పూజలు నిర్వహించారు. సంప్రదాయంగా 18 వారాలు రాహుకాల దీపాలు పూజలు పూర్తి చేసిన 42 మంది భక్తులు 19వ వారం ఉద్యాపన పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, 108 నిమ్మకాయల మాల, చీర, జాకెట్టు సమర్పించారు. సాయంత్రం వేదపారాయణం, తదుపరి సంధ్యామేళం, రాత్రి కుంభ హారతులు, పల్లకి సేవలు విశేషంగా జరిగాయి. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దనరెడ్డి పర్యవేక్షించారు.

డీఎస్‌ఓను కలిసిన డీలర్లు



నెల్లూరు(పొగతోట): నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్ఓ విజయ్‌కుమార్‌ను డీలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో ఆయన్ను కలిసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గిరి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు



రాజశేఖర్‌కు సన్మానం

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని శ్రీమద్ ద్రౌపదీదేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అవధాని కోట రాజశేఖర్ రుక్మిణి కల్యాణ ఘట్టాన్ని ప్రవచించారు. ఉదయం ఆలయ అర్చకులు మల్లవరపు లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో పూజలు, విశేష హోమాలను నిర్వహించారు. సాయంత్రం మహిళ భక్తులచే సామూహిక లలితా సహస్రనామస్తోత్ర పారాయణం జరిగింది. ఉభయదాతలుగా పూజారి విజయకుమార్ దంపతులు వ్యవహరించారు. అవధాని రాజశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్వామి సమయానందనాథ, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ సాదా నాగేంద్రకుమార్, కంచి జ్ఞానేంద్ర, అన్నవరం సత్యనారాయణ, టి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌జాన్ చిత్రాలకు ప్రశంసలు



చిత్రకారుడు అమీర్‌జాన్‌కు సన్మానం

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజమండ్రిలో శుక్రవారం నిర్వహించిన అమరావతి చిత్ర కళావీధి కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన షేక్ అమీర్‌జాన్ ప్రదర్శించిన చిత్రాలు పలువురి ప్రశంసలందుకున్నాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీ స్టేట్ క్రియేటివిటీ, కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ తేజశ్విని, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజ్, కల్చర్ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు తదితరులు అమీర్‌జాన్‌ను సన్మానించారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు



సీతారాముల కల్యాణోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు

నెల్లూరు(బృందావనం): శ్రీరామనవమి సందర్భంగా రామ్‌నగర్ శబరి శ్రీరామ క్షేత్రంలో శని, ఆదివారాల్లో జరిగే ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం సీతా జయంతిని నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు కోదండరాముడు, సీతామహాదేవిల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. నిర్వాహకులు షామియానాలు, కల్యాణ వేదిక, భక్తులు ఆశీనులయ్యేందుకు ఏర్పాట్లు చేయిస్తున్నారు. శబరి శ్రీరామక్షేత్రాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

ముగిసిన ఇంటర్ మూల్యాంకనం

నెల్లూరు(టౌన్): ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం శుక్రవారంతో ముగిసింది. స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాలలో గతనెల 7వ తేదీన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 1,200 మంది అధ్యాపకులు, 150 మంది సిబ్బంది పాల్గొన్నారు. జిల్లాకు 3.54 లక్షల జవాబుపత్రాలు వచ్చాయి. వాటిని మూల్యాంకనం చేసి స్కానింగ్ తర్వాత సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఇంటర్ బోర్డు కార్యాలయానికి పంపించినట్లు ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. మూల్యాంకనంలో పాల్గొన్న అధ్యాపకులు, ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు.

సోమిరెడ్డితో పార్థసారథి భేటీ

నెల్లూరు సిటీ: రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి శుక్రవారం రూరల్ మండలంలోని అల్లీపురానికి విచ్చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎండీ రాజాబాబు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



పొదలకూరు: మండలంలోని అంకుపల్లి, డేగపూడి గ్రామాల్లో శుక్రవారం గడ్డివాములు దగ్ధమయ్యాయి. ప్రమాదవశాత్తు వాములకు నిప్పంటుకుని మంటలు వ్యాపించడంతో పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అంకుపల్లి ఎస్సీ కాలనీలో సీహెచ్ వెంకటరమణయ్యకు చెందిన సుమారు 600 గడ్డి మోపులు, డేగపూడిలో పీ బాలఓబుల్‌రెడ్డికి చెందిన 300 మోపులు అగ్నిప్రమాదాల్లో దగ్ధమయ్యాయని పొదలకూరు అగ్నిమాపకశాఖ అధికారి వరప్రసాద్ వెల్లడించారు.

6 నుంచి బ్రహ్మోత్సవాలు



గుంజ ప్రతిష్ట చేస్తున్న ప్రధాన అర్చకులు

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని నరసింహకొండపై ఉన్న వేదగిరి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 6 నుంచి 16వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గుంజ ప్రతిష్ట కార్యక్రమం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా జరిగింది. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు మాట్లాడుతూ ప్రజలు బ్రహ్మోత్సవాలకు విచ్చేసి స్వామి, అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓ గోపి, అర్చకులు కృష్ణమాచార్యులు, అప్పలాచార్యులు, రాఘవాచార్యులు, మురళీధరాచార్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంసీ ప్రగతిపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కమిషనర్, అధికారులు

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ వివిధ అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కమిషనర్ సూర్యతేజ ఇందులో పాల్గొన్నారు. టిడ్కో గృహాల నిర్మాణం, నూతన లబ్ధిదారులకు గృహాల కేటాయింపు, అన్న క్యాంటీన్ల నిర్వహణ, చెత్త సేకరణ, వేసవి కాలం దృష్ట్యా ప్రజలందరికీ తాగునీటి సరఫరా, చలివేంద్రాల ఏర్పాటు, ఆస్తి పన్నుల వసూళ్లు, భవన నిర్మాణాలకు అనుమతులు, పీఎం సూర్యఘర్, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర తదితర అంశాలపై నెల్లూరు నగర పాలక సంస్థ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్‌మోహన్‌రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాలకు వాటర్ ప్యూరిఫైయర్ల వితరణ



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్: జిల్లాలోని పలు బీసీ వసతి గృహాలకు లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్, నెల్లూరుకు చెందిన కెనరా బ్యాంక్ వారు రూ.2 లక్షల విలువైన ఐదు వాటర్ ప్యూరిఫైయర్లను అందజేశారు. ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం బీసీ బాలికల వసతి గృహాలు, కావలి బీసీ కళాశాల బాలికల, వెంకటాచలం బీసీ బాలుర, వెంకటాచలం బీసీ బాలికల వసతి గృహాలకు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మకు వాటర్ ప్యూరిఫైయర్లను అందించారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మైక్‌సెట్, స్పీకర్ల అందజేత



నెల్లూరు(అర్బన్): నగరంలోని 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ బిట్ – 2లో ఉన్న నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలకు వరపరివార్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.10 వేల విలువైన మైక్‌సెట్, స్పీకర్లను అందించారు. కెనడాలో ఉంటున్న స్నేహసింధు, ప్రదీప్ దంపతుల కుమార్తె సాన్వి పుట్టినరోజును పురస్కరించుకుని వీటిని ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్‌పర్సన్ మాధవి, పాఠశాల హెచ్‌ఎం కిరణ్, ఉపాధ్యాయురాలు ప్రసన్న, ఇంకా ఉషారాణి, సాయినిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జయభారత్ ఆస్పత్రికి విరాళం



నగదు చెక్కును అందిస్తున్న దృశ్యం

నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో నేత్ర రక్ష సేవా పథకం పేరుతో బెజవాడ రామచంద్రారెడ్డి కంటి విభాగం ద్వారా చేస్తున్న ఉచిత కంటి ఆపరేషన్ల కోసం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. శుక్రవారం బెజవాడ రామచంద్రారెడ్డి మనవడు సునీల్ చంద్రారెడ్డి, ఆయన భార్య ఉమ నగదును చెక్కు రూపంలో జయభారత్ ఆస్పత్రిని నడిపిస్తున్న సింహపురి వైద్యసేవా సమితి చైర్మన్ సీతారామిరెడ్డి ద్వారా ఇచ్చారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఈ విరాళంతో 100 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సింహపురి వైద్యసేవా సమితి కోశాధికారి గుర్రం సుధాకర్, ఆస్పత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో ఆంధ్రప్రదేశ్ మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలవారీ సమావేశం శుక్రవారం జరిగింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 250 మందికి పైగా మీడియేటర్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 23వ డివిజన్ కార్పొరేటర్ డి.శ్రీనివాసులురెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, పి.పుల్లారెడ్డి, ఎం.మధుసూదన్‌యాదవ్, కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడిగా పి.విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎంవీ రమణయ్య, కార్యదర్శులుగా పి.మస్తాన్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సీహెచ్ మమతారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా పి.పద్మావతమ్మ నియమితులయ్యారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

- డీఎంహెచ్ఓ సుజాత



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మాతాశిశు మరణాలను అరికట్టేందుకు ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సుజాత సూచించారు. మాతాశిశు మరణాలపై ఆరోగ్య సబ్ కమిటీ సమావేశం శుక్రవారం నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగింది. ఈ సంవత్సరం జనవరి నెలలో జరిగిన ఒక మాతృ మరణం, ఆరు శిశు మరణాలకు గల కారణాలు, లోపాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ గర్భం దాల్చిన ప్రతి మహిళను మొదటి నెలలోనే గుర్తించి వారి వివరాలను రిజిస్టర్ చేయాలన్నారు. తర్వాత క్రమం తప్పకుండా వారికి ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. బీపీ, రక్తహీనత ఉన్న హైరిస్క్ గర్భిణుల విషయంలో ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవడం, సకాలంలో వారికి ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారం అందేలా చూడటం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడొచ్చన్నారు. ప్రభుత్వాస్పత్రిలో సుఖ ప్రసవం జరిగే వరకు ఆరోగ్య కార్యకర్త బాధ్యత వహించాలన్నారు. ఎక్కడైనా సకాలంలో వైద్యం అందక మరణాలు సంభవిస్తే అలాంటి చోట్ల ఆరోగ్య సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల లోపు పిల్లలందరికీ షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించాలన్నారు. పురిటి పిల్లలకు తల్లి పాలు ఇచ్చేలా వారిని చైతన్యం చేయాలని కోరారు. ఈనెల 7వ తేదీన జరిగే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలను నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శేషారత్నం, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ గీతాలక్ష్మి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.బెన్‌హర్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరి, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.